
సాక్షి
కర్నూలు
శుక్రవారం । 20 । సెప్టెంబర్ । 2024



అలరించిన హరికథ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల నిత్యకళావేదికపై గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన కె.ప్రమీలరాణి వారి భక్తమార్కండేయ హరికథ కార్యక్రమం భక్తులను అలరించింది.



పీజీ కోర్సులపై తగ్గుతున్న ఆసక్తి

రాయలసీమ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలు భారీగా తగ్గాయి. ఇదివరకులా విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. - 8లో..



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1.633
ప్రస్తుతం	:1.632
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:10.687
అవుట్ ఫ్లో	:10.147

న్యూస్‌రీల్

నేటి నుంచి ఆర్‌యూ పీజీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు పీజీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నిర్దేశించిన తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు 55 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరికి వర్సిటీలోనే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హాల్‌టికెట్లను సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లకు పంపడం జరిగిందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో కూడా హాల్ టికెట్లు పొందవచ్చని, నిర్దేశించిన సమయానికి అరగంట ముందుకుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ఒకటి నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అక్టోబర్ ఒకటి నుంచి క్యాన్సర్ రోగులకు స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ప్రారంభించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆసుపత్రి వైద్యులు విశాఖపట్టణంలో హెచ్‌బీసీహెచ్ అండ్ ఆర్‌సిలో అంకాలజి కోసం శిక్షణ పొందారన్నారు. ఈ బృందంలో జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ డీఎస్ చక్రవర్తి, పెథాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.శాంత, డెంటల్ సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.విజయకుమార్, కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట సుబ్బనాగరాజు, ఓబీజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ స్నేహ, రేడియాలజి ఆంకాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్. సాయిమాధురి, రేడియాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. దిలీప్‌కుమార్ ఉన్నట్లు తెలిపారు. ప్రతి మంగళ, గురువారాల్లో రూమ్ నెం.6లో ప్రీవెంటివ్ అంకాలజి రోగులకు స్క్రీనింగ్ నిర్వహించాలని వైద్యులకు ఆదేశించామన్నారు.

జిల్లా రిజిస్ట్రార్‌గా చెన్నకేశవరెడ్డి

కర్నూలు(సెంట్రల్): స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా వి.చెన్నకేశవరెడ్డి నియమితులయ్యారు. వాస్తవానికి ఆయనను మార్కెట్ వ్యాల్యూ అండ్ ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్‌గా నియమించారు. అయితే ఇక్కడ జిల్లా రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న నాగలింగేశ్వరరావును డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రిజిస్ట్రార్ బదిలీ చేయడంతో ఆయన స్థానంలో పూర్తి అదనపు బాధ్యతలతో జిల్లా రిజిస్ట్రార్‌గా నియమించారు. మరో వైపు మార్కెట్ వాల్యూ అండ్ ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఉమామహేశ్వరిని అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. కాగా, వీ.చెన్నకేశవరెడ్డి ప్రస్తుతం నంద్యాల జిల్లా రిజిస్ట్రార్‌గా పని చేస్తూ కర్నూలుకు బదిలీపై వస్తున్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు మళ్లీ దరఖాస్తుల గడువు పెంపు

కర్నూలు సిటీ: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు మరోసారి గడువు పెంచినట్లు డీఈఓ శామ్యూల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 5వ తేదీ నుంచి మొదలైన దరఖాస్తు ప్రక్రియ మొదట ఈ నెల 06వ తేదీ వరకు ఉన్న గడువును 17వ తేదీ వరకు పెంచారన్నారు. ఈ గడువును మరోసారి ఈ నెల 24వ తేదీ వరకు పెంచినట్లు తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఏపీ మోడల్ స్కూళ్లలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఈ పరీక్ష రాసేందుకు కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3.50 లక్షల్లో లోపు ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పరీక్ష ఈ ఏడాది డిసెంబరు 8న జరుగుతుందన్నారు. పూర్తి వివరాలు www.bse.ap. gov.in అనే వెబ్‌సైట్‌లో చూసి తెలుసుకోవచ్చునని డీఈఓ పేర్కొన్నారు.



చిత్రంలో కనిపిస్తున్నది నిర్మాణంలో ఉన్న ఆదోని మెడికల్ కళాశాల. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనులు ప్రారంభించింది. అయితే సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయంతో కళాశాలపై నీలినీడలు కమ్ముకున్నాయి.



నిత్యం తాగునీటి సమస్య ఎదుర్కొనే కోడుమూరుకు శాశ్వత పరిష్కారానికి గత ప్రభుత్వం రూ.78 కోట్లు కేటాయించింది. అయితే టీడీపీ ప్రభుత్వం ఆ పనులు చేపట్టే దిశగా ప్రయత్నం చేయడం లేదు. ప్రజలు దాహార్తితో అవస్థలు పడుతున్నారు.



పత్తికొండ, డోన్, ఆదోని చుట్టు పక్కల ప్రాంతాల్లోని టమాట రైతులు ఏటా ధర పతనమై నష్టాల పాలవుతున్నారు. వీరిని ఆదుకునేందుకు డోన్, ఆలూరు ప్రాంతాల్లో టమాట జ్యూస్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి విస్మరించారు.



పాలనకు వంద రోజులు.. హామీలకు నూరేళ్లు!

చంద్రబాబు ప్రభుత్వం కొలువుదీరి నేటికి సరిగ్గా వందరోజులు. ఎన్నికలకు ముందు 'సూపర్ సిక్స్'కు అదనంగా ప్రత్యేకంగా ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధికి అలవికాని హామీలు గుప్పించారు. వందరోజుల పాలనలో 'సూపర్ సిక్స్'లో ఒక్క హామీని కూడా అమలు చేయని ప్రభుత్వం, జిల్లాకు ఇచ్చిన హామీల ప్రస్తావన కూడా చేయని పరిస్థితి. 'అధికారం దక్కింది, ఇక అడిగేవారెవరు?' అనే రీతిలో పాలన సాగుతోంది. ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా జిల్లా అభివృద్ధికి గత ప్రభుత్వం తీసుకున్న చర్యలను రద్దు చేస్తున్నారు. దీంతో జిల్లా అభివృద్ధి తిరోగమనంలో పయనించే పరిస్థితి నెలకొంది.

వంద రోజుల పాలన అట్టర్‌ఫ్లాప్!

- ఎన్నికల ప్రచారంలో వందల హామీలు
- ఉమ్మడి జిల్లా అభివృద్ధిని విస్మరించిన చంద్రబాబు
- ఆర్డీఎస్, వేదవతి ప్రాజెక్టు ఊసెత్తని ప్రభుత్వం
- గాజులదిన్నె నుంచి కోడుమూరుకు పారని తాగునీరు
- పులకర్తి ద్వారా సి.బెళగల్ చెరువులకు నీళ్లు ఉత్తుత్తే
- కార్యరూపం దాల్చని నగరడోణ రిజర్వాయర్
- కలగానే డోన్, ఆలూరులో టమాట జ్యూస్ ఫ్యాక్టరీలు
- అటకెక్కిన అలగనూరు రిజర్వాయర్ నుంచి నందికొట్కూరుకు తాగునీరు సరఫరా హామీ

పారని హామీలు ఇవీ..

• కృష్ణాజలాలను సీమకు పారించి వలసలను నివారిస్తాం. • కూటమి అధికారంలోకి రాగానే ఆర్‌డీఎస్‌ను పూర్తి చేస్తాం • వేదవతి ప్రాజెక్టు పూర్తి చేస్తాం • పులకుర్తి ఎత్తిపోతల ద్వారా సి.బెళగల్ చెరువుకు నీళ్లు, ఎల్ఎల్‌సీ ద్వారా నీరందని ఆయకట్టుకు సాగునీరు • నగరడోణ రిజార్వయర్ పూర్తి చేస్తాం • సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం పూర్తి చేస్తాం • గురు రాఘవేంద్ర ప్రాజెక్టు నిర్మాణం కోసం చర్యలు • పత్తికొండ నియోజకవర్గంలోని చెరువులకు కృష్ణానీరు ఇస్తాం • మిడుతూరు, కొత్తపల్లి మండలాలకు జద్దువారిపల్లి ఎత్తిపోతల పథకం నుంచి తాగు, సాగునీరు • సిద్ధాపురం చెరువు నుంచి పంటకాలువలు ఏర్పాటు • ఇందిరేశ్వరం, శ్రీపతిరావు పేట గ్రామాలకు సిద్ధాపురం చెరువు నుంచి సాగునీరు.



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.352 కోట్ల వ్యయంతో డోన్ నియోజకవర్గం దాహార్తిని తీర్చేందుకు ఉద్దేశించిన వాటర్‌గ్రిడ్ పథకం ఇది. ఇందులో భాగంగా మూడు మండలాల్లో ఇంటింటికి తాగునీటిని అందించే లక్ష్యంతో గత ప్రభుత్వంలోనే 70 ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం అధికార టీడీపీ ప్రభుత్వం ఈ పనులను ఎక్కడికక్కడ నిలిపేసింది. చేస్తామన్న పనులు చేయలేకపోతున్న చంద్రబాబు, కనీసం ప్రజల దాహార్తి విషయంలోనూ కనికరికం చూపకపోవడం గమనార్హం.

సాక్షి ప్రతినిధి కర్నూలు: నోరు ఒకటి చెబుతుంది.. చెయ్యి ఇంకోటి చేస్తుంది.. దేనితోవ దానిదే.. అన్నట్లుంటుంది చంద్రబాబు హామీలు, అమలు తీరు! ఎన్నికల సీజన్ వస్తే చాలు నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థులు పేపర్లో రాసి ఇచ్చిన ప్రతీ సమస్యను అధికారంలోకి రాగానే చేస్తానని హామీలు గుప్పిస్తారు.. అధికారం దక్కిన తర్వాత ఐదేళ్లలో ఒక్క హామీని అమలు చేయరు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో టీడీపీ ప్రభుత్వం కొలువుదీరితే ఆగస్టు 15న స్వాతంత్ర్య వేడుకలను కర్నూలులో నిర్వహించారు. జిల్లా అభివృద్ధికి 15 ముఖ్య హామీలు గుప్పించారు. ఐదేళ్లలో ఒక్కటీ అమలు చేయలేకపోయారు. 2019లో అధికారం కోల్పోయారు. 2019 నుంచి 2024 వరకూ జిల్లా అభివృద్ధి కోసం గత ప్రభుత్వం నంద్యాల, ఆదోనిలో మెడికల్ కాలేజీల నిర్మాణం, కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఆస్పత్రితో పాటు లోకాయుక్త, హెచ్ఆర్సీ, వక్ఫ్‌ట్రిబ్యునల్, ఏపీఈఆర్‌సీ, సీబీఐ కోర్టు, నేషనల్ లా యూనివర్సిటీకి శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో మొన్నటి సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఎలాగైనా విజయం సాధించాలని మళ్లీ సమస్యల చిట్టాను చదివి అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వీటితో పాటు 'సూపర్ సిక్స్' పేరుతో మరిన్ని హామీలు ఇచ్చారు. నేటికి కూటమి ప్రభుత్వం ఏర్పాటై సరిగ్గా వంద రోజులు. వంద రోజులు అద్భుతపాలన సాగిందని, వారం రోజులు వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే ఈ వంద రోజుల్లో 'సూపర్ సిక్స్'లో ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేకపోయారు. దీంతో పాటు జిల్లాకు ఇచ్చిన హామీల ప్రస్తావన కూడా ఈ వంద రోజుల పాలనలో లేకపోవడం గమనార్హం.

వందరోజుల్లో చేసిన ఘనత ఇదీ!

హంద్రీ–నీవా నీటి ద్వారా పత్తికొండ, డోన్, ఆలూరు, పాణ్యం నియోజకవర్గాల్లో 77 చెరువులకు నీరిచ్చేందుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో 69 చెరువులకు గతేడాది నీరు కూడా ఇచ్చారు. ఈ ఏడాది ఒక్క చెరువుకూ నీరివ్వలేదు. శ్రీశైలంలో నీరున్నా హంద్రీ–నీవా ద్వారా కేవలం 1,350 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేసి 'సీమ'కు అన్యాయం చేస్తున్నారు. వేదవతి ప్రాజెక్టుకు టీడీపీ ప్రభుత్వంలో డీపీఆర్ సిద్ధం చేసి పనులు ముందుకు కదల్లేదు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత భూసేకరణ చేసి ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించారు. రూ.వంద కోట్ల బిల్లులు కూడా మంజూరు చేశారు. అయితే టీడీపీ నేతలు భూసేకరణపై కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారు.

కూటమి ప్రభుత్వం నిలిపేసిన పనులు

- గోరుకల్లు రిజర్వాయర్ నుంచి డోన్ నియోజకవర్గంతో పాటు వెల్దుర్తికి వాటర్ గ్రిడ్ మంజూరు చేశారు. ఈ పనులు జరుగుతున్నాయి. వీటిని అర్ధంతరంగా ఆపేశారు.
- డోన్‌లో టీటీడీ కళ్యాణమండపం, కేంద్రీయ విద్యాలయ నిర్మాణం, గుత్తి రోడ్డులోని ప్రభుత్వ బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలకు నూతన భవన నిర్మాణాలు నిలిపేశారు.
- డోన్ మండలం కొత్తకోట సమీపంలో ఐటీడీఆర్ డ్రైవింగ్ శిక్షణ కేంద్ర భవన నిర్మాణం ఆగిపోయింది.
- ప్యాపిలిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు అతీగతీ లేదు.
- డోన్ మండలం సొత్రం గుండాల లక్ష్మీచెన్నకేశవ ఆలయ పునరుద్ధరణ పనులు నిలిపేశారు.
- ఆధునిక కూరగాయల మార్కెట్ నిర్మాణం, ఎంపీడీవో కార్యాలయ భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి.
- వెంకటాపురం, వెంగళంపల్లి చెరువుల వద్ద టూరిజం ప్రాజెక్టు కింద చేపట్టిన బోట్ షికారు నిర్మాణ పనులు కూడా ఆపేశారు.

నియోజకవర్గాల అభివృద్ధి పేరుతో మరిన్ని హామీలు

- కోడుమూరు ఏర్పాటైనప్పటి నుంచి తాగునీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి గత ప్రభుత్వం రూ.78కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఇందులో తొలిదశలో రూ.20కోట్లు మంజూరు చేస్తూ జీవో 918 జారీ చేసింది. కానీ మొన్నటి ఎన్నికల ప్రచారంలో గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్ ద్వారా కోడుమూరుకు శాశ్వతంగా తాగునీరు సరఫరా చేస్తామని చంద్రబాబు హామీ ఇవ్వడం గమనార్హం.
- కోడుమూరులో డిగ్రీ కళాశాల ఏర్పాటు, గ్రామీణ ప్రాంత రహదారుల నిర్మాణం
- గూడూరులో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- ఆలూరులో డిగ్రీ, ఐటీఐ కళాశాలకు సొంత భవనాల నిర్మాణం
- కర్నూలు నుంచి బళ్లారి వరకు నేషనల్ హైవే రోడ్డు నిర్మాణానికి చర్యలు
- దేవరగట్టులో జింకల పార్కు ఏర్పాటు
- డోన్, ఆలూరులో టమాట జ్యూస్ ఫ్యాక్టరీలు
- నంద్యాల జిల్లా నుంచి డోన్‌ను విడదీసి కర్నూలు జిల్లాకు మార్పు
- డోన్‌లో బాలికల జూనియర్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు
- నందికొట్కూరు మునిసిపాలిటీకి అలగనూరు రిజర్వాయర్ ద్వారా తాగునీరు
- తంగడంచను సీడ్‌హబ్‌గా అభివృద్ధి
- బనగానపల్లెలో అర్హులైన ప్రతి కుటుంబానికి రెండు సెంట్ల ఇంటిస్థలం ఇస్తామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బనగానపల్లికి రింగు రోడ్డు, కోవెలకుంట్లకు బైపాస్ రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు.
- గ్రీన్‌కో పవర్ ప్రాజెక్టును విస్తరిస్తాం. ఓర్వకల్లుకు మరిన్ని పరిశ్రమలు తీసుకొస్తాం
- పాణ్యం నియోజకవర్గాన్ని రాయలసీమలో పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దుతాం
- కర్నూలు సిటీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తాం

పథకాలకు పేర్లు మార్చడం తప్ప ఏమీ చేయలేదు



చంద్రబాబునాయుడు వంద రోజుల పాలనతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాల పేర్లు మార్చారే తప్ప ఆయన ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతుండడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వంద రోజుల్లో రూ.43 వేల కోట్ల అప్పు మాత్రం చేసి రికార్డు సృష్టించారు. వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికే వైఎస్ జగన్, గత ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారు.

– ఎస్వీ మోహన్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు

సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత జాబితాలో చేర్చాలి



చంద్రబాబునాయుడు, లోకేష్‌లు జిల్లాకు ఎన్నో హామీలు ఇచ్చారు. వేదవతి, ఆర్‌డీఎస్, గుండ్రేవుల ప్రాజెక్టులను ప్రాధాన్యత జాబితాలో చేర్చి పూర్తి చేయాలి. ప్రజల ఆకాంక్ష మేరకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో శ్రద్ధ చూపడం లేదు. ఒక్క పెన్షన్‌లు తప్ప ఏమి ఇవ్వలేదు. పశ్చిమ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పి వలసలను నివారించేందుకు చర్యలు చేపట్టాలి. నూరు రోజుల పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యం.

– బి.గిడ్డయ్య, జిల్లా కార్యదర్శి, సీపీఐ

రాయలసీమ అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదు



చంద్రబాబునాయుడుకు రాయలసీమ అభివృద్ధిపై చిత్తశుద్ధిలేదు. తుంగభద్రపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రాయలసీమ రైతుల నోట్లో కర్ణాటక మట్టి కొట్టేందుకు కౌతాళం సమీపంలో రోడ్డు కమ్ బ్రిడ్జిని నిర్మించాలని చూస్తోంది. ఆ రాష్ట్ర మంత్రి వచ్చి ప్రదేశాన్ని పరిశీలించినా ఇక్కడి రైతులకు అన్యాయం జరుగుతుందని ఒక్క మంత్రి కూడా స్పందించకపోవడం విచారకరం. వందరోజుల పాలనలో రాష్ట్రానికి మేలు చేసే పనులపై టీడీపీ నాయకులు దృష్టి సారించడంలేదు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణాలను నిలుపుదల చేయాలని మెమో ఇవ్వడం అన్యాయం.

– డి.గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శి, సీపీఎం

26న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు (హాస్పిటల్): జిల్లా యువజన సంక్షేమ శాఖ/సెట్కూరు ఆధ్వర్యంలో ఈనెల 26న జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. ఈ మేరకు గురువారం ఆయన తన చాంబర్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.క్యాంప్‌లోని సిల్వర్‌జూబ్లీ కళాశాలలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ, జానపద నృత్యాలు (సోలో, గ్రూప్), జానపద గీతం (సోలో, గ్రూప్), పోయట్రీ, స్టోరీ రైటింగ్–కథారచన, పోస్టర్ మేకింగ్–చిత్రలేఖన, డిక్లమేషన్/వక్తృత్వం అంశాలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. మొదటి స్థానంలో నిలిచిన విజేతలను రాష్ట్రస్థాయికి అక్కడ మొదటి స్థానంలో నిలిచిన వారికి జాతీయ స్థాయి పోటీలకు పంపుతామన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన యువతీ యువకులు, కళాకారులు తమ పేరు లేక బృందం పేరును వెబ్‌లింక్ https://bit.ly/knldyf24 ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవడానికి వీలు కానివారు నేరుగా 26వ తేదీ ఉదయం 9 గంటల లోపు వచ్చి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 91214 15234ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సెట్కూరు సీఈఓ పి.దీప్తి, సూపరింటెండెంట్ రాజేశ్వరి పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

క్వింటా ఉల్లి రూ.3,808

- ధరలో పురోగతి లేక రైతుల ఆందోళన

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి ధరలో పురోగతి లేకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. గురువారం మార్కెట్‌కు 165 మంది రైతులు 5,174 క్వింటాళ్ల ఉల్లి తీసుకొచ్చారు. కనిష్ట ధర రూ.297, గరిష్ట ధర రూ.3,808 లభించింది. మోడల్ ధర రూ.3,510 నమోదైంది. ప్రస్తుతం పూర్తిగా పొడి వాతావరణం ఉంది. ఉల్లిలో నాణ్యత కూడా మెరుగైంది. డిమాండ్ ఉన్నా ఇక్కడ ధర లభించకపోవడం గమనార్హం.

- వేరుశనగకు కూడా అంతంతమాత్రం ధరనే లభిస్తోంది. మార్కెట్‌కు వేరుశనగ 1,581 క్వింటాళ్లు వచ్చింది. కనిష్ట ధర రూ.2,332, గరిష్ట ధర రూ.7,329 లభించింది. మోడల్ ధర రూ.4,500 మాత్రమే నమోదైంది.
- సజ్జ ధర మరింత తగ్గింది. తాజాగా కనిష్ట ధర రూ.1,749, గరిష్ట ధర రూ.2,191 లభించగా.. సగటు ధర రూ.2,160 నమోదైంది.
- మినుములు, కొర్రల ధరలు కూడా తగ్గిపోవడం పట్ల రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కల్లుకుంట ఘటనపై దళిత సంఘాల ఆగ్రహం

- దళిత మహిళకు న్యాయం చేయాలని కలెక్టరేట్ ముట్టడి
- ఘటనపై కలెక్టర్, ఎస్పీ స్పందించాలని డిమాండ్



కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న దళిత సంఘాలు

కర్నూలు(సెంట్రల్): పెద్దకడబూరు మండలం కల్లుకుంటలో జరిగిన ఘటనపై ఎమ్మిగనూరు నియోజకవర్గ దళిత సంఘాల జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్రవర్ణాలకు చెందిన పెత్తందారులు దళిత మహిళ గోవిందమ్మను వివస్త్రను చేసి చిత్ర హింసలకు గురి చేసినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమంటూ మండిపడ్డారు. గురువారం కల్లుకుంట ఘటనకు నిరసనగా ఎమ్మిగనూరు నియోజకవర్గ దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో దళితులు కలెక్టరేట్‌ను ముట్టడించారు. న్యాయం కావాలని ముందుగా గాంధీ విగ్రహం ఎదుట నినదించారు. అనంతరం పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కలెక్టరేట్ మెయిన్ గేటు వైపు దూసుకెళ్లారు. అక్కడ పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. చివరకు కొందరు మెయిన్ గేటును తోసుకుంటు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా దళిత సంఘాల జేఏసీ నాయకులు రంగయ్య, చార్లెస్ మాట్లాడుతూ.. కల్లుకుంటలో దళిత మహిళ గోవిందమ్మను బట్టలు ఊడదీసి చెట్టుకు కట్టేసి అత్యాచారం చేసే ప్రయత్నం చేశారన్నారు. ఒక మహిళపై దాదాపు 150 మంది అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు దాడి చేశారన్నారు. కంటి తుడుపుగా 9 మందిపై మాత్రమే పోలీసులు కేసు నమోదు చేసి పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. సంఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా కలెక్టర్, ఎస్పీలు కనీసం సందర్శించి విషయాన్ని ఎందుకు తెలుసుకోవడం లేదని ప్రశ్నించారు. వెంటనే కల్లుకుంట సంఘటనపై పూర్తి స్థాయి విచారణ చేసి గోవిందమ్మపై దాడి చేసిన వారిందరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. కేసును నీరుగార్చేతే పోరాటాలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

ఎల్లెల్సీ కాలువలో వ్యక్తి గల్లంతు



గాలిస్తున్న గజ ఈతగాళ్లు (ఇన్‌సెట్లో) సోమశేఖర్‌గౌడ్

హాలహర్వి: మండలంలోని బాపురం ఎల్లెల్సీలో నీళ్లు తాగేందుకు వెళ్లి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. బాపురం గ్రామానికి చెందిన సోమశేఖర్‌గౌడ్(38) అనే వ్యక్తి గురువారం పొలం పనులకు వెళ్లాడు. పని ముగించుకొని ఇంటికి వచ్చే క్రమంలో దాహం వేయడంతో కాలువలో నీళ్లు తాగేందుకు వెళ్లాడు. అదు పుతప్పి కాలువలోకి పడిపోయాడు. ఈత రాకపోవడంతో ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో కొట్టుకుపోయాడు. ఇరుగుపొరుగు వారు గమనించి కేకలు వేయడంతో అక్కడే ఉన్న కొంతమంది యువకులు నీటిలో దిగి సోమశేఖర్‌గౌడ్ కోసం గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో నే హాలహర్వి ఎస్‌ఐ చంద్ర, బాపురం ఎంపీటీసీ ప్రహ్లాదరెడ్డికి సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన వ్యక్తికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘానికి ఎన్నికలు నిర్వహించేందుకు పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ షెడ్యూలు విడుదల చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం పశుసంవర్ధక శాఖ కర్నూలు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దుర్గాప్రసన్నబాబును ఎన్నికల అధికారిగా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా నియమించారని జేడీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. వాటిని పరిష్కరించి ఈ నెల 24న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తామని, 26న ఎన్నికల అధికారి నోటిఫికేషన్ ఇస్తారని తెలిపారు. అక్టోబరు 5న నామినేషన్ల స్వీకరణ,7న పరిశీలన, 8న నామినేషన్‌ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని తెలిపారు.అక్టోబరు 22న 12 డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తామన్నారు. అదే రోజున డైరెక్టర్లందరు సమావేశమై చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారని వెల్లడించారు.



మంచి మార్కులొచ్చినా సీటు రాకపోవచ్చు

మా నాన్న ప్రభుత్వ ఉద్యోగి. మాది మధ్యతరగతి కుటుంబం. నేను ఇంటర్‌లో 472 (సీబీఎస్‌ఈ) మార్కులు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 428 మార్కులు సాధించాను. ఇప్పుడు నీట్ యూజీలో ఇంకా మంచి మార్కులు సాధించి మెడికల్ సీటు సాధించాలని ఉంది. కానీ ప్రస్తుత పరిస్థితులు చూస్తే ఆందోళనగా ఉంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలోకి తీసుకొస్తే మెడికల్ సీట్లు ఎక్కువగా మేనేజ్‌మెంట్ కోటాలోకి వెళ్లే అవకాశం ఉంది. అలాంటప్పుడు నాలాంటి వారు ఎంత బాగా చదివినా సీటు వచ్చే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. దీంతో పాటు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటువారికి అప్పగిస్తే నిర్వహణ బాగుండదు. అక్కడ వైద్యులు, సౌకర్యాలు, వసతులు సరిగ్గా ఉండవు. రోగులు తగినంత మంది ఉండరు. రోగుల నుంచి ఫీజులు కూడా వసూలు చేసే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అక్కడ వైద్యవిద్య కూడా కష్టంగా ఉంటుంది.

– ఎస్‌టీ. జయాంశ, కర్నూలు





ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఫీజు తక్కువ

మా నాన్న ప్రభుత్వ టీచర్. ఎంతో కష్టపడి నన్ను చదివిస్తున్నారు. నన్ను డాక్టర్‌గా చూడాలన్నది ఆయన కల. ఆయన ఆశయాల మేరకు నేను కష్టపడి చదువుతున్నాను. ఈ మేరకు టెన్త్‌లో 469 (సీబీఎస్‌ఈ) మార్కులు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 422 మార్కులు వచ్చాయి. ఇదే విధంగా కష్టపడి ఇంటర్ సెకండియర్‌తో పాటు నీట్ యూజీలో మంచి మార్కులు తెచ్చుకుంటానన్న విశ్వాసం నాకుంది. మంచి ర్యాంకు వస్తే తప్పకుండా నాకు మెడికల్ సీటు వస్తుంది. అయితే ప్రభుత్వ మెడికల్ కాలేజీలు పెరిగితేనే మాలాంటి వారికి న్యాయం జరుగుతుంది. అక్కడైతే ఫీజులు తక్కువ. వైద్యులు, సౌకర్యాలు, వసతులు బాగుంటాయి. రోగులు ఎక్కువ మంది ఉంటారు కాబట్టి ప్రాక్టికల్స్ కూడా బాగుంటాయి. అదే ప్రైవేటు వారికిస్తే ఇలాంటి సౌకర్యాలు ఉండదు. కనీసం అక్కడ రోగులు కూడా ఉండరు. దానివల్ల మాలాంటి వారికి తీవ్ర నష్టం జరుగుతుంది. ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచించి ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పెంచే దిశగా చర్యలు తీసుకోవాలి.

– బి.బి. అనీషా, కర్నూలు

పీజీ కోర్సులపై తగ్గుతున్న ఆసక్తి

- ఆర్‌యూ క్యాంపస్ కళాశాలల్లో 480 సీట్లకు 145 సీట్లే భర్తీ
- వీరిలో ఎంత మంది చేరుతారో తెలియని పరిస్థితి
- ఎకనామిక్స్‌లో 3, స్టాటిస్టిక్స్ 5, మ్యాథ్స్, తెలుగు, కెమిస్ట్రీ (ఎస్‌ఎఫ్) 6, ఫిజిక్స్‌లో 7 సీట్లే భర్తీ



ఆర్‌యూలో సబ్జెక్టుల వారీగా మొత్తం సీట్లు, భర్తీ వివరాలు

సబ్జెక్టు	మొత్తం సీట్లు	2023–24లో భర్తీ సీట్లు	2024–25లో భర్తీ సీట్లు
ఇంగ్లిష్	39	8	11
తెలుగు	39	12	6
ఎకనామిక్స్	39	2	3
కామర్స్	55	3	8
బాటనీ	44	37	17
మ్యాథ్స్	39	22	6
స్టాటిస్టిక్స్	33	4	5
ఫిజిక్స్	39	13	7
ఆర్గానిక్ కెమిస్ట్రీ	33	26	22
బయోటెక్నాలజీ	44	30	15
జువాలజీ	55	36	29
ఆర్గానిక్ కెమిస్ట్రీ (ఎస్‌ఎఫ్)	33	25	6
కంప్యూటర్ సైన్స్	55	22	10
మొత్తం	547	240	145

కర్నూలు కల్చరల్: ఒకప్పుడు పీజీ కోర్సులకు భారీగా డిమాండ్ ఉండేది. వర్సిటీల్లో సీటు దక్కాలంటే ఎంతో కష్టపడి చదవాల్సి ఉండేది. మంచి ర్యాంక్ వచ్చినా కొన్ని సార్లు సీటు దక్కని పరిస్థితి. కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దరఖాస్తు చేసుకుంటే చాలు సీటు వస్తుంది. అయినా, చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. ఆర్‌యూ క్యాంపస్ కళాశాలల్లో 480 సీట్లకు గాను కేవలం 145 సీట్లే భర్తీ కావడమే అందుకు ఉదాహరణ.

డిపార్ట్‌మెంట్లు వెలవెల

గతంలో ఎప్పుడూ లేని విధంగా రాయలసీమ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) కోర్సుల్లో ప్రవేశాలు భారీగా తగ్గాయి. ఇదివరకులాగా సంప్రదాయ పీజీ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆర్‌యూ పరిధిలోని కళాశాలల్లో సీట్లు భర్తీ కాని పరిస్థితి నెలకొంది. ఆర్‌యూ క్యాంపస్ కళాశాలల్లో ఆర్ట్స్‌కు సంబంధించి మూడు డిపార్ట్‌మెంట్లలో మూడు కోర్సుల్లో 172 సీట్లు, సైన్స్‌కు సంబంధించి 9 డిపార్ట్‌మెంట్లలో 9 కోర్సులకు 375 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 547 సీట్లు భర్తీ కావాల్సి ఉంది. ఈ విద్యా సంవత్సరం అందులో 145 సీట్లే భర్తీ అయ్యాయి. ఇందులో ఎకనామిక్స్‌లో 3, స్టాటిస్టిక్స్ 5, మ్యాథ్స్ 6, తెలుగు 6, కెమిస్ట్రీ (ఎస్‌ఎఫ్) 6, ఫిజిక్స్‌లో 7 సీట్లే భర్తీ అయ్యాయి. సీట్లు పొందిన వారిలో ఎంత మంది అడ్మిషన్ తీసుకుంటారనేది ప్రశ్నార్థకంగా మారింది.

- గత ఏడాది 547 సీట్లకు 240 ప్రవేశాలు పొందడంతో కొంత పర్వాలేదనిపించినా ఈ ఏడాది మరీ దారుణంగా అడ్మిషన్లు పడిపోయాయి. 547 సీట్లకు గాను 145 మంది ఎంపికయ్యారు. ఏపీ పీజీసెట్‌లో అర్హత మార్కులు పొందిన వారి సంఖ్య నామ మాత్రంగా ఉండటంతో పాటు డిగ్రీ పూర్తి అయిన వారు ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల వైపు ఆసక్తి చూపుతుండటంతోనే పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు పడిపోతున్నట్లు వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి. సీట్లు భర్తీ కానీ కోర్సుల స్థానంలో వృత్తి పరమైన, ఉపాధి కల్పించే కోర్సులు అందుబాటులోకి తెస్తే పీజీ పూర్తి అయిన తరువాత ఉపాధి అవకాశాలు దక్కుతాయని విద్యావేత్తలు చెబుతున్నారు.

ఆటో బోల్తాపడి మహిళా కూలీ మృతి

- మరో ఐదుగురికి గాయాలు



మృతి చెందిన లక్ష్మీదేవి

పత్తికొండ(తుగ్గలి): ఎదురుగా వచ్చిన బైక్‌ను తప్పించబోయి ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ మహిళా కూలీ మృతి చెందగా, మరో ఐదుగురికి గాయాలయ్యాయి. పత్తికొండ మండలం కొత్తపల్లి వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రోజూమాదిరిగానే గురువారం ఉదయాన్నే పత్తికొండ పట్టణంలోని గాంధీ నగర్‌కు చెందిన వ్యవసాయ కూలీలు ఆటోలో కొత్తపల్లికి బయలుదేరారు. గ్రామ సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వచ్చిన బైక్‌ను తప్పించబోయి కల్వర్టు పక్కనున్న గుంతలోకి ఆటో పడింది. ఈ ప్రమాదంలో లక్ష్మీదేవి(62) అక్కడికక్కడే మృతి చెందగా, ఈశ్వరమ్మ, అంజలి, చిట్టెమ్మ, లక్ష్మి, మల్లేష్ గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉన్న వారిని వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. పట్టణ సీఐ జయన్న ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎస్ రామచంద్రారెడ్డి

బాధితులను పరామర్శించిన నాయకులు

ప్రమాదంలో గాయపడి పత్తికొండ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షత గాత్రులను వైఎస్సార్‌సీపీ నేత, కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ ఎస్ రామచంద్రారెడ్డి, టీడీపీ నేత సాంబశివారెడ్డి, సీపీఐ నాయకులు పరామర్శించారు. మృతి చెందిన లక్ష్మీదేవి కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు.

హత్తిబెళగల్‌లో పట్టపగలే చోరీ

- 9 తులాల బంగారు, 25 తులాల వెండి ఆభరణాలు అపహరణ

ఆలూరు రూరల్: మండలంలోని హత్తిబెళగల్ గ్రామంలో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితురాలు పెద్ద రంగన్న భార్య రామలక్ష్మి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రామలక్ష్మి భర్త బెంగళూరులో జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం రామలక్ష్మి వ్యవసాయ కూలీ పనికి వెళ్లింది. మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి ఇంటి రాగా ఇంటి తలుపు తెరిచి బీరువా లాకర్ పగలగొట్టి ఉంది. బీరువాలో ఉంచిన 9 తులాల బంగారు, 25 తులాల వెండి ఆభరణాలు కనిపించలేదు. వెంటనే చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల పెద్దహోతూరు గ్రామంలో తాళాలు వేసిన ఇంట్లో చొరబడి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఈ సంఘటన మరవక ముందే హత్తిబెళగల్ గ్రామంలో మరోసారి దొంగలు పట్టపగలు తాళం వేసిన ఇంట్లో చొరబడి ఆభరణాలు అపహరించుకోని వెళ్లడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



బీరువా తెరిచి బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన దొంగలు

బీసీ హాస్టల్ విద్యార్థినులకు అస్వస్థత

ఆదోని సెంట్రల్: స్థానిక బీసీ హాస్టల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. భాగ్యమ్మ, ఇందు హాస్టల్‌లో ఉంటూ స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నారు. ఎప్పటిలాగే గురువారం వసతి గృహంలో టిఫిన్ చేసుకుని కాలేజీకి వెళ్లిన వీరు ప్రార్థన సమయంలో కళ్లు తిరిగిపడిపోయారు. గమనించిన కాలేజీ ప్రిన్సిపాల్ సంజన్న, అధ్యాపకులు హుటాహుటిన చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికి భాగ్యమ్మ అనే విద్యార్థిని స్పృహలోకి రాగా ఇందు అనే విద్యార్థినికి మాత్రం బీపీ కంట్రోల్ కాలేదు. దీంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు ఆసుపత్రికి రెఫర్ చేశారు. విద్యార్థినుల అస్వస్థతపై వార్డన్ పరిమళమ్మను వివరణ కోరగా ఉదయం టిఫిన్ చేసి వెళ్లారని, అనారోగ్యమా లేక మరే కారణమో తెలియదని తెలిపారు.



అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ఇసుక ఇక ఆన్‌లైన్‌లో బుకింగ్

కర్నూలు న్యూసిటీ: ఇసుకను ఇక నుంచి ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవచ్చుని జిల్లా గనులు భూగర్భ ఖనిజాల శాఖ ఉపసంచాలకులు రాజశేఖర్ గురవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు స్వయంగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేలా ప్రభుత్వం రూపొందించిన పోర్టల్ ప్రారంభమైందన్నారు. బుకింగ్‌పై అవగాహన లేని వారు గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేందుకు సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. బుక్ చేసుకున్న ఇసుకను మైనింగ్ శాఖలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాల ద్వారా సరఫరా చేస్తామని వివరించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

- ఒకరు మద్యానికి బానిసై.. మరొకరు అప్పుల బాధతో



మృతి చెందిన ఓబులేసు

బనగానపల్లె రూరల్ : మండలంలో వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు బలవన్మరణానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే. బనగానపల్లె పట్టణంలోని పంచమపేట కాలనీలో నివాసం ఉంటున ధారపత్తి ఓబులేసు (44) మద్యానికి బానిస అయ్యాడు. దీంతో తరచుగాభార్య జ్యోష్నతో గొడవపడేవాడు. భరించలేక బుధవారం ఆమె ఇద్దరు పిల్లతో పుట్టింటికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన ఓబులేసు ఇంట్లో సిలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. ఈమేరకు మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.

- బనగానపల్లె మండలంలోని నందవరం గ్రామానికి చెందిన కె. రమేష్(28) ఆటో డ్రైవర్‌గా పని చేస్తూనే గ్రామంలో భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుంటాడు. ఈ క్రమంలో ఆటో కొనుగోలు , పంటల పెట్టుబడి కోసం సుమారు రూ.8.50లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక మానసికంగా సతమతమయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 17న గ్రామశివారులోని ఓ రైతు పొలంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడురోజుల తర్వాత గుర్తించినట్లు ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. మృతుడికి భార్య చౌడేశ్వరి ఉంది.



రమేష్(ఫైల్)

మామ మందలించాడని..



మృతురాలు గుంతమల్లు ఉమాదేవి

సంజామల: మండల పరిధిలోని వసంతాపురంలో మామ మందలించాడని మనస్థాపానికి గురై కోడలు ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన గుంతమల్లు మద్దిలేటి రైల్వే ప్రభుత్వ ఉద్యోగి. ఈయన నంద్యాలలో జాబ్ చేస్తూ వారానికి ఒక సారి గ్రామానికి వస్తుంటాడు. భార్య ఉమాదేవి(35)ని ఈనెల 14వ తేది రాత్రి మామ గుంతమల్ల శిఖామని తిట్టాడని ఆమె మనస్థానానికి గురై పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక గురువారం ఉదయం మృతి చెందింది. మృతురాలుకు భర్త గుంతమల్లు మద్దిలేటి, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. మృతురాలి తండ్రి నాగేశన్న ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగు మందు తాగి యువ రైతు బలవన్మరణం



పురుగుమందు తాగుతూ సెల్ఫీ తీసుకుంటున్న రైతు నరసింహులు

ఆదోని అర్బన్: మండలంలోని నాగలాపురం గ్రామానికి చెందిన నరసింహులు (25) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం పెద్దకడబూరు మండలం నెమలికల్లు ఫారెస్టులో ఈ ఘటన జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్ద వీరేష్ కుమారుడైన నరసింహులు కొన్నేళ్లుగా తన సొంతపొలం 80 సెంట్లతో పాటు కొంత భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తూ జీవనం సాగించేవాడు. అయితే, అవసరాలు, పంట పెట్టుబడి కోసం అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై గురువారం నెమలికల్లు ఫారెస్టులో పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆ సమయంలో సెల్ఫీ తీసుకొని కుటుంబసభ్యులకు పంపించాడు.. మృతుడికి భార్య స్వాతి, కుమార్తె సంతానం. వీరు ఆస్పత్రి వద్ద రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. కేసు నమోదు చేసుకున్న పెద్దకడబూరు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థినికి పాముకాటు?

పత్తికొండ(తుగ్గలి): మండల పరిధిలోని దూదేకొండ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 1వ తరగతి విద్యార్థిని సౌమ్య గురువారం పాముకాటుకు గురైంది. మధ్యాహ్న భోజన విరామ సమయంలో పాఠశాల ఆవరణలో పాము కరిచిందని కాలికి పడిన కాట్లు చూపించడంతో ఉపాధ్యాయులు పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థినికి వైద్యులు వైద్యం అందించారు. విషయం తెలుసుకున్న ఎంఈవో రమేష్ విద్యార్థిని పరామర్శించారు.

పెద్దాసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 70 ఏళ్ల వృద్ధురాలికి అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. గురువారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనరల్ సర్జరీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణనాయక్ వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే.. 'హాలహర్వికి చెందిన సావిత్రమ్మ(70) వారం రోజుల క్రితం కడుపునొప్పి, వాంతులతో పాటు ఒంట్లో లవణాల శాతం తగ్గిపోయి ఆసుపత్రిలోని జనరల్ మెడిసిన్ విభాగంలో చేరింది. అక్కడ అన్ని పరీక్షలు నిర్వహించి జనరల్ సర్జరీకి రెఫర్ చేశారు. చిన్నపేగు మెలికపడి కొద్దిభాగం చెడిపోయింది. ఈ మేరకు ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో చెడిపోయిన చిన్నపేగును తొలగించాం. ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో ఆపరేషన్ చేయడంతో ఆమె త్వరగా కోలుకున్నారు' అని చెప్పారు. ఇలాంటి ఆపరేషన్ ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో చేయడం ఇదే మొదటిసారన్నారు. ఆపరేషన్‌ను తనతో పాటు డాక్టర్ సాబిరా, డాక్టర్ చైతన్యవాణి, డాక్టర్ మన్సూర్‌బాషా, డాక్టర్ ప్రణీత్, అనెస్తెటిస్ట్ డాక్టర్ సోమశేఖర్, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ చంద్రిక నిర్వహించారన్నారు. సావిత్రమ్మ కోలుకోవడంతో గురువారం డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు.



వృద్ధురాలు సావిత్రమ్మతో వైద్యుల బృందం

కారు ఢీకొని బాలుడి మృతి



మృతి చెందిన అబుబకర్ సిద్దిక్

బనగానపల్లె రూరల్: మూడేళ్ల బాలుడిని కారు రూపంలో మృత్యువు కబళించింది. బనగానపల్లెలో జరిగిన ఈ సంఘటన బాధిత కుటుంబంలో విషాదం నింపింది. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసే మహమ్మద్అలీ , రెహానా దంపతులకు అబుబకర్ సిద్దిక్(3) అనే కుమారుడు ఉన్నాడు. స్థానిక పింజరిపేట కాలనీలో నివసించే వీరికి ఒక్కగానొక్క సంతానం కావడంతో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు. గురువారం ఉదయం ఇంటి సమీపంలో బాలుడు ఆడుకుంటుండగా అటుగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయం కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఏకైక కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు ఆసుపత్రి ప్రాంగణంలో మిన్నంటాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బనగానపల్లె సీఐ కృష్ణ తెలిపారు.

చందాలు వేసి.. గుంతలు పూడ్చి

- అధ్వానంగా ధణాపురం – నాగనాథనహళ్లి రోడ్డు
- రహదారి మరమ్మతులకు ఆటో డ్రైవర్ల చొరవ
- చందాలతో 10 కి.మీ మేర గుంతలు పూడ్చిన వైనం



చందాలు సేకరిస్తున్న ఆటో కార్మికులు



జేసీబీతో గుంతలు పూడ్చుతున్న దృశ్యం

ఆదోని అర్బన్: అడుగడుగునా మోకాటి లోతు గుంతలు.. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ఆసుపత్రి పాలు కావాల్సిందే. ఆ రహదారి మీదుగా వెళ్లే వాహనాలు వారానికోసారి షెడ్డుకు వెళ్లాల్సిందే. ఇంతటి దారుణమైన రహదారిపై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించారు. ఆ ఊర్ల వైపు 108 వాహనం రాలేనంతగా రోడ్డు శిథిలమైనా పాలకులు కూడా పట్టించుకోలేదు. చివరకు ఆ రహదారిపై నిత్యం ప్రయాణించే ఆటో డ్రైవర్లు, వాహనదారులు చందాలు వేసుకుని గుంతలు పూడ్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదోని మండలంలో ధణాపురం – నాగనాథనహళ్లి రోడ్డుపై ప్రయాణమంటే నరకాన్ని తలపిస్తోంది. ఈ రహదారిపై ఇప్పటి వరకు ఎంతో మంది ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ఆసుపత్రి పాలైన సంఘటనలు ఉన్నాయి. ఇక ఆటో కార్మికుల పరిస్థితి మరీ దారుణం. రోజు వారి సంపాదన మొత్తం ఆటో రిపేర్లకు పెట్టాల్సిందే. ఆదోని నుంచి నాగనాథహళ్లి గ్రామానికి వెళ్లాలంటే ఆటో చార్జీ రూ. 30 తీసుకుంటారు. 10 మందిని ఆటోలో తీసుకెళ్తే రూ.300 వస్తాయి. ఒకసారి వెళితే బోల్తా పడడం, ఆటో రిపేరీ కావడమో తప్పని పరిస్థితి. దీంతో ఈ రహదారిపై ప్రయాణించే హెబ్బటం, ధణాపురం, నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన ఆటో కార్మికులు సుమారు 50 మంది, మరి కొందరు వాహనదారులు సైతం తమవంతుగా చందాలు వేసుకొని రెండు రోజులుగా జేసీబీ పెట్టి పెద్ద పెద్ద గుంతలను పూడ్చుకున్నారు. ఆటో డ్రైవర్ల చొరవను పలువురు అభినందిస్తున్నారు. అధికారులు, పాలకులు వెంటనే చర్యలు తీసుకుని రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ప్రమాదాలను పట్టించుకోలేదు



ఈ రహదారిలో పెద్దపెద్ద గుంతలు ఉన్నాయి. 20 ఏళ్ల నుంచి చూస్తున్నాం. ఈ రోడ్డుని ఎవరూ పట్టించుకోవడం లేదు. చిన్న గుంతలు వర్షానికి పెద్దగా మారాయి. దీంతో ప్రమాదాలు రోజు రోజుకు పెరిగాయి. మా ఆటోలు కూడా ప్రతిరోజు రిపేర్లకు వస్తున్నాయి. ఎంత సంపాదించినా బాడుగలు మిగలడం లేదు. రిపేర్లకే సరిపోతున్నాయి. దీంతో ఆటో వాళ్లంతా చందాలు వేసుకుని పెద్ద పెద్ద గుంతలను జేసీబీతో పూడుస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు, రాజకీయ నాయకులు ఈ రోడ్డును అభివృద్ధి చేయాలి.

– రాముడు, ఆటో డ్రైవర్